సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2024



కడ్తాల్: బతుకమ్మ ఆడుతున్న యువతులు



కడ్తాల్‌లో..

బతుకమ్మతో చిన్నారి

ఆమనగల్లులో..





సద్దుల సంబురం



షాబాద్: బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న అతివలు

సద్దుల బతుకమ్మ సంబరాలు గురువారం జిల్లాలో అంబరాన్ని తాకాయి. ఆడపడుచులు సంప్రదాయ వస్త్రాలు ధరించి.. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. గ్రామాల్లోని చౌరస్తాల్లో వాటిని ఒకచోట చేర్చి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ వాటి చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో హోరెత్తించారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. చివరగా ఊరేగింపుగా బతుకమ్మలను తీసుకెళ్లి సమీపంలో చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.





న్యూస్‌రీల్

సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా దయానంద్ రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న దయానంద్ రెడ్డి

తుర్కయంజాల్: తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడకు చెందిన దాసరి దయానంద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టినందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అత్యధిక కెమెరాలు అలంకారప్రాయమే..

సాక్షి, సిటీబ్యూరో: 'గ్రేటర్' పరిధిలోని మూడు కమిషనరేట్లలో సీసీ కెమెరాల పరిస్థితి పేరు గొప్ప, తీరు దిబ్బ అన్నట్లు తయారైంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో కలిపి ఆరు లక్షలకు పైగా సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అత్యధికం పని చేయట్లేదు. మూడు కమిషనరేట్లకు చెందిన అధికారులతో సిటీ కొత్వాల్ సీపీ ఆనంద్ గురువారం నిర్వహించిన సమీక్షలో ఈ విషయం గుర్తించారు. బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలోని హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పోలీసు విభాగం 2014–15 నుంచి రాజధానిలో సీసీ కెమెరాల ఏర్పాటునకు ప్రాధాన్యం ఇస్తోంది. సేఫ్ సిటీ ప్రాజెక్ట్, కమ్యూనిటీ, సిటీ వైడ్ సర్వైలెన్స్, నేను సైతం ప్రాజెక్టుల కింద పోలీసు విభాగం ఈ కెమెరాలను ఏర్పాటు చేసింది. అనేక నేరాల నియంత్రణ, కేసుల్ని కొలిక్కి తీసుకురావడంతో పాటు సున్నిత, సమస్యాత్మక సమయాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ కెమెరాలు, వాటిలో రికార్డు అయిన ఫీడ్ ఉపకరించింది. కనీసం వీటి నిర్వహణ బాధ్యతలనూ ప్రభుత్వం చేపట్టకపోవడంతో ప్రస్తుతం అనేకం పని చేయట్లేదు. పోలీసు అధి కారులతో పాటు వాటిని సరఫరా చేసిన వారితోనే ఆనంద్ భేటీ అయ్యారు. ఆయా కెమెరాల మరమ్మతులకు భారీ మొత్తం అవసరం అవుతుందని గుర్తించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆనంద్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్‌కు ప్రభుత్వం శ్రీకారం

- పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం
- నేడు కొందుర్గులో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న సీఎం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఒకేచోట.. చదువుల పూదోట

షాద్‌నగర్/కొందుర్గు: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలను అధునాతనంగా తీర్చిదిద్దడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలలను వేర్వేరుగా కాకుండా ఒకేచోట నిర్మించాలని నిర్ణయించింది. కుల మతపరమైన వివక్షను తొలగించి సమీకృత విద్యా క్యాంప్‌లను నిర్మించేలా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రతి నియోజకవర్గంలో నిర్మించేలా కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో నిర్మించే పాఠశాల భవన నిర్మాణానికి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

కొందుర్గు తూర్పు శివారులో..

ప్రభుత్వం రూ.125 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం కొందుర్గు తూర్పు శివారులోని సర్వే నంబర్ 109లో సుమారు 20 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడనున్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భూమిపూజకు సంబంధించిన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. భూమిపూజ నిర్వహించే స్థలం, హెలిప్యాడ్, బహిరంగ సభ నిర్వహించే స్థలం, వాహనాల పార్కింగ్‌ను సిద్ధం చేస్తున్నారు. సుమారు 50 జేసీబీలు, హిటాచీలు, టిప్పర్ల సాయంతో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ అధికారులు హుటాహుటిన 163 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. కలెక్టర్ శశాంక, డీసీపీ రాజేష్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పనులను పర్యవేక్షిస్తున్నారు. సభను విజయవంతం చేసేలా ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సీఎం రాక సందర్భంగా భద్రతా చర్యలను శంషాబాద్ డీసీపీ రాజేష్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వెంకటేశ్వర రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్ రావు, డీఈ రవీందర్ కుమార్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఎస్ఐ కృష్ణయ్య, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్‌లో ప్రత్యేకతలు ఇవే..

- ప్రతి పాఠశాలను సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు.
- విద్యార్థులకు తరగతి గదులే కాకుండా అంతర్జాతీయ స్కూల్స్‌తో సమానంగా క్యాంపస్‌లను అధునాతన విద్యా సంస్థలుగా నిర్మించనున్నారు.
- విద్యార్థులకు ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించనున్నారు.
- అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందించనున్నారు.
- సుమారు 5 వేల మంది విద్యార్థులకు 500 మంది ఉపాధ్యాయులు బోధించనున్నారు. పాఠశాల భవనాన్ని అంతర్జాతీయ పాఠశాలలతో సమానంగా నిర్మించనున్నారు.

నాణ్యమైన విద్య



ప్రపంచంతో పోటీ పడే విధంగా అన్ని వర్గాల విద్యార్థులను ఒకే గొడుకు కిందకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్యను అందించేందుకు కొందుర్గులో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నాం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి

బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా సహ ఇన్‌చార్జి కట్టా సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

షాద్‌నగర్: పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా సహ ఇన్‌చార్జి కట్టా సుధాకర్‌రెడ్డి నాయకులకు సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి బూత్‌లో ఇంటింటికీ తిరగాలని, ప్రతి బూత్‌లో విధిగా 200 సభ్యత్వాలు చేయించాలన్నారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సభ్యత్వం కీలకం కానుందని చెప్పారు. వికసిత్ భారత్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు కమ్మరి భూపాలాచారి, చెంది మహేందర్‌రెడ్డి, ప్యాట అశోక్ పాల్గొన్నారు.

సాకుతో చార్జీల షాక్

- ఆర్టీసీ బస్సుల్లో 25 నుంచి 50 శాతం అదనం
- ప్రత్యేక రైళ్లలో 20 శాతం అదనపు బాదుడు
- ప్రైవేట్ బస్సుల్లో రెండింతలు



సాక్షి, సిటీబ్యూరో: పట్నం నుంచి పల్లెలకు దసరా రద్దీ పోటెత్తింది. నాలుగు రోజులుగా వివిధ మార్గాల్లో లక్షలాది మంది పల్లెబాట పట్టారు. బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాలు కిక్కిరిశాయి. గురువారం సైతం రైళ్లు, బస్సుల్లో రద్దీ కనిపించింది. చాలామంది సొంత వాహనాల్లో బయలుదేరారు. నాలుగైదు రోజులుగా సుమారు 25 లక్షల మంది వరకు సొంత ఊళ్లకు వెళ్లినట్లు అంచనా.

- సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏటా ప్రకటించే ఆర్టీసీ ఈసారి దసరా ప్రత్యేక బస్సులపై మాత్రం గుట్టుచప్పుడు కాకుండా అదనపు బాదుడుకు పాల్పడింది. జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఖాళీ బస్సులను తరలించాల్సి వస్తుందనే సాకుతో ప్రత్యేక బస్సులపై 25 నుంచి 50 శాతం వరకు అదనపు చార్జీలు విధించింది.
- మరోవైపు మహిళా ప్రయాణికుల డిమాండ్ మేరకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో లేకపోవడంతో వారు సైతం చార్జీలు చెల్లించి ప్రయాణం చేయాల్సివచ్చింది.

రైళ్లలోనూ అ'ధనమే..'

దసరా, దీపావళి రద్దీని దృష్టిలో ఉంచుకొని అక్టోబర్, నవంబర్ నెలల్లో రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక సర్వీసులను నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. ఈ ప్రత్యేక రైళ్లన్నింటిలో సాధారణ చార్జీలపై 20 శాతం అదనంగా విధించారు. దసరా సందర్భంగా వచ్చిన వరుస సెలవుల నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాళ్లు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలివెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రయాణికుల రద్దీ భారీగా ఉంది. రిజర్వేషన్‌లు లభించని వాళ్లు జనరల్ బోగీల్లో బయలుదేరారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్‌ల నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరిన అన్ని రైళ్లలో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.

ప్రైవేట్ దోపిడీ రెండింతలు..

మరోవైపు హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు నడిచే ప్రైవేట్ బస్సులు దారి దోపిడీకి పాల్పడ్డాయి. సాధారణ రోజుల్లో విధించే చార్జీలను రెండింతలు చేశాయి. బస్సులు, రైళ్లే కాకుండా ట్యాక్సీలు, కార్లు, టాటాఏస్‌లు వంటి ప్రైవేట్ వాహనాల్లో సైతం ఇష్టారాజ్యంగా చార్జీల వసూళ్లకు పాల్పడ్డారు. పండగ సందర్భంగా సొంత ఊరుకు వెళ్లాలని భావించే నగరవాసుల సెంటిమెంట్‌ను సొమ్ము చేసుకున్నారు.

నోరు, ముక్కు మూసి.. ఆభరణాలు దోచేసి..

వృద్ధురాలి మెడలో బంగారు నగలు తస్కరణ


సుమతమ్మ

యాచారం: వృద్ధురాలనే కనికరం లేకుండా నోరు, ముక్కు మూసి మెడలో ఉన్న ఆరు తులాల బంగారు అభరణాలు అపహరించారు. ఈ సంఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ లిక్కి కృష్ణంరావు కథనం ప్రకారం.. ఆకులామైలారం గ్రామానికి చెందిన దేవరశెట్టి సుమతమ్మ బుధవారం రాత్రి 11 గంటల వరకు గ్రామంలోని దుర్గామాత విగ్రహం వద్ద పూజలో పాల్గొని నిద్రపోవడానికి ఇంట్లోకి వెళ్లింది. అర్ధరాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అమె ఇంటికి వచ్చి పెద్దమ్మ.. అన్న బ్యానర్ ఇవ్వమన్నాడు అంటూ సుమతమ్మను నిద్రలేపారు. ఆమె ఇంటి తలుపులు తీసి ఎవరు అంటుండగానే నోరు, ముక్కు మూసి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, చేతులకు ఉన్న నాలుగు తులాల బంగారు గాజులను లాక్కుని పరారయ్యారు. సుమతమ్మకు ఇద్దరు కొడుకుల్లో నందీశ్వర్ గ్రామ మాజీ సర్పంచ్ కాగా, చంద్రశేఖర్ కందుకూర్ పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిసున్నారు. రాజకీయ కుటుంబంతో కావడంతో బ్యానర్ అనగానే సుమతమ్మ తెలిసిన వారై ఉంటారని నమ్మి తలుపులు తీసింది.


చోరీ జరిగిన సుమతమ్మ ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గ్రామాన్ని సందర్శించిన ఏసీపీ

విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు గ్రామాన్ని సందర్శించారు. సీఐ కృష్ణంరాజుతో కలిసి బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. చోరీకి పాల్పడిన వారు బుధవారం ఉదయం నుంచి ఓ నంబర్ లేని కారులో గ్రామంలో సంచరించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టి-20 క్రికెట్ మ్యాచ్ సందర్భంగా
ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

ఉప్పల్: ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 12న భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగనున్న నేపథ్యంలో ఉప్పల్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

- మ్యాచ్ జరిగే సమయాల్లో ఉప్పల్ స్టేడియంవైపు భారీ వాహానాలను అనుమతించరు.
- వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహానాలు చెంగిచర్ల ఎక్స్‌రోడ్డు, చర్లపల్లి ఐఓసీ కేంద్రం, ఎన్ఎఫ్‌సీ మీదుగా తమ గమ్యాలను చేరుకోవాలి.
- వరంగల్ వైపు నుంచి ఎల్‌బీనగర్ వెళ్లాల్సిన వారు ఉప్పల్ ఏషియన్ థియేటర్ ఎదురుగా భగాయత్ రోడ్డు నుంచి నాగోల్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలి.
- ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ వచ్చే వాహనాలు నాగోల్ మెట్రోస్టేషన్, ఉప్పల్ భగాయత్ నుంచి ఏషియన్ థియేటర్ మీదుగా బోడుప్పల్ చేరుకోవాలి.
- సికింద్రాబాద్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం పారిశ్రామిక వాడ ద్వార చెంగిచర్ల మీదుగా వరంగల్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.
- రామంపూర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు హబ్సిగూడ వీధి నంబర్-8 మీదుగా హబ్సిగూడ మెట్రో పిల్లర్ 972 వద్ద యూ టర్న్ తీసుకుని ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు చేరుకోవాలి.

‘టాటా’ చెప్పలేనంటూ..!

నగరంతో రతన్‌టాటాకు విడదీయలేని బంధం

- నగరం రూపురేఖలు మార్చిన టాటా ఆలోచనలు
- రూ. వేల కోట్లతో అంతర్జాతీయ స్థాయి సంస్థల స్థాపన
- టీహబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు
- యువతకు అద్భుతమైన సందేశం ఇచ్చిన రతన్‌టాటా


టీహబ్ ప్రారంభోత్సవంలో అప్పటి ఐటీ శాఖమంత్రి కేటీరామారావు తదితరులతో రతన్‌టాటా (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో/ఇబ్రహీంపట్నం రూరల్/రాయదుర్గం: 2008లో హైదరాబాద్‌కు రావాల్సిన టాటా నానో కార్ల తయారీ సంస్థ గుజరాత్‌కు తరలిపోవడంతో.. దీనిపై అప్పటి సీఎం దివంగత రాజశేఖర్‌రెడ్డి రతన్‌టాటాకు రాసిన లేఖలో తన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే హైదరాబాద్ విషయంలో తన వద్ద చాలా పెద్ద ఆలోచనే ఉందని రతన్ టాటా ప్రత్యుత్తరంలో సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత ఆదిబట్లలో పురుడుపోసుకున్నదే సికోర్‌స్కై హెలికాప్టర్ ప్రాజెక్టు.

రూపురేఖలు మార్చిన టాటా..

రతన్ టాటాకు నగరంతో విడదీయలేని అనుబంధం ఉంది. భాగ్యనగర అభివృద్ధిలో రతన్ టాటా తోడ్పాటు మరువలేనిది. ఎన్నోసార్లు నగరానికి వచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా నగర అభివృద్ధికి దోహదపడ్డారు. హైదరాబాద్‌లో వినూత్న ఆవిష్కరణలకు ఊతమిచ్చేవారు. రూ.వేల కోట్ల పెట్టుబడులు, అంతర్జాతీయ స్థాయి కంపెనీలు నెలకొల్పి నగరంపై చెరగని ముద్రవేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్లలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ టీసీఎస్.. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీలో ‘కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (కెసీఐఎస్)’ను ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాదు ఏరోస్పేస్ రంగంలోనూ హైదరాబాద్ నగరం తలెత్తుకుని సగర్వంగా నిలబడేలా చేయడంతో పాటు వేలాది మందికి ఉపాధి కల్పించారు. టాటా పెట్టుబడులతో ఆయా ప్రాంతాల్లో రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సందర్శన..

టీహబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన అదే సమయంలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజేనారాయణన్‌తో మాట్లాడారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. టాటా చొరవతోనే ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ రూపంలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2015లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సీఎస్ఆర్ ఫండింగ్‌తో కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (కెసీఐఎస్)ను గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభించారు.

టీహబ్‌తో అనుబంధం



టీ హబ్ సమావేశ మందిరంలోని తన ఫొటోపై సంతకం చేస్తున్న రతన్‌టాటా (ఫైల్)

గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో 2015లో టీహబ్ ఫేజ్-1 ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడే ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేషన్ సెంటర్‌గా అభివర్ధించారు. భారత్ అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందని, అయితే ఎంట్రప్రెన్యూర్‌షిప్ పరంగా భారత్‌ను ప్రపంచం గుర్తించలేదన్నారు. అందరమూ కలిసి నయా భారత్‌ను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీ-హబ్ సమావేశ మందిరంలో ఆయన చిత్రంతో ఏర్పాటు చేసిన ఫలకంపై స్వయంగా సంతకం చేసి మురిసిపోయారు.

భారత్‌కు కొత్త ముఖం..


రతన్‌టాటాకు స్వాగతం పలుకుతున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజేనారాయణన్(ఫైల్)

‘టీహబ్ అనేది భారత్‌కు ఒకకొత్త ముఖం లాంటిది. ఒకప్పుడు కొంత ఎక్స్‌పీరియెన్స్ ఉంటేనే మాట్లాడాలనే వారు. ఇప్పటి యువతలో అద్భుతమైన ప్రతిభ ఉంది. 20 ఏళ్ల యువత మంచి ఐడియా ఉండి.. వ్యాపారం చేయాలనుకుంటే ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి. టీహబ్ లాంటి వ్యవస్థలు అలాంటి వారి కోసం ఎంతో దోహదపడుతున్నాయి. మనమంతా కలిసి కొత్త భారత్‌ను నిర్మిద్దాం’ ఇవీ దిగ్గజ వ్యాపారవేత్త, గొప్ప మానవతావాది రతన్ నావల్ టాటా హైదరాబాద్‌లో మాట్లాడిన చివరి మాటలు. టీ-హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాటలు ఎల్లప్పుడూ యువతలో స్ఫూర్తి నింపుతూనే ఉంటాయి.. ఈ మాటలను ఎప్పటికీ భాగ్య నగరం గుర్తుంచుకుంటుంది.

కారు ఢీకొని యాచకురాలి మృతి

మొయినాబాద్: అతివేగంతో వచ్చిన కారు భిక్షాటన చేస్తున్న వృద్ధురాలిని బలితీసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన డప్పు రుక్కమ్మ(75) బాలాజీ దేవాలయం వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. గురువారం మధ్యాహ్నం ఆలయం వద్ద ఎప్పటిలాగే భిక్షాటన చేస్తుండగా ఓ కారు (టీఎస్ 07 హెచ్‌పీ 2359) అతివేగంతో దూసుకొచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆమెను వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మడిగెలపై అధికారుల ఆరా !

'సాక్షి' కథనానికి స్పందన

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో మడిగెల ప్రారంభోత్సవంలో జాప్యంపై అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. గురువారం ×సాక్షి×లో ×మడిగెలకు మోక్షమెప్పుడో× శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు దీనికి సంబంధించి ఆలస్యానికి కారణాలను లిఖితపూర్వకంగా అందజేయాలని మార్కెట్ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను ఆదేశించినట్లు తెలిసింది. విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు కూడా స్పందించి వెంటనే మీటర్లు అమర్చుతామని తెలిపినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి గాయాలు

కుత్బుల్లాపూర్: వేగంగా వచ్చి డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన మీసాల ధనుంజయ్ (19) వృత్తిరిత్యా డ్రైవర్. కాగా ఈనెల 9న రాత్రి 10.30 గంటల సమయంలో తాను పనిచేస్తున్న రిలయన్స్ గోదాంకు ధనుంజయ్ (ఏపీ09 ఏడబ్ల్యు0877) బైక్‌పై తోటి డ్రైవర్ శ్రీరాములును కూర్చొబెట్టుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుండ్లపోచంపల్లి శ్మశానవాటిక సమీపానికి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం (ఏపీ28టీఏ 8389) బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ధనుంజయ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న శ్రీరాములు కూడి చేయి విరగడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు కాగా డీసీఎం డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు కల్యాణలక్ష్మి వరం


మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: పేద మహిళలకు కల్యాణలక్ష్మి వరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, చెక్కులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుదోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, తహసీల్దార్ ఎండీ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మునగపాటి నర్సింహులు, జంగయ్య, మహేందర్‌గౌడ్, ఖాజామీయా, రాహుల్‌గుప్తా, చేవెళ్ల స్వామి, శ్రీరాంరెడ్డి, సుభాన్‌రెడ్డి, సూర్యగౌడ్, అన్వర్, రవియాదవ్, రాఘువేందర్, గౌరీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఏసీపీ కిషన్, సీఐ కాంతారెడ్డి తదితరులు

చేవెళ్ల ఏసీపీ కిషన్

షాబాద్: యువత క్రీడల్లో రాణించాలని చేవెళ్ల ఏసీపీ కిషన్, షాబాద్ సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో దసరా పునస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొనగా, విజేతగా కుమ్మరిగూడ జట్టు, రన్నరఫ్‌గా అంతారం జట్టు, మూడో బహుమతి షాబాద్ జట్లు నిలిచాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ యువకుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలతో శారీరకదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు.

అమరవీరుల దినోత్సవం సందర్భంగా...

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పీఆర్ఆర్ స్టేడియంలో త్వరలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు 14వ తేదీ వరకు షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. 16వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్‌రెడ్డి, సతీశ్‌కుమార్, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, యువకులు శ్రీను, రాజు, మజీద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

ఒకరికి తీవ్ర గాయాలు

మొయినాబాద్: అతివేగంతో దూసుకొచ్చిన ట్రాక్టర్, ఆటోను ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎలుకగూడ గ్రామానికి చెందిన మహేశ్ లాలూ మానేశ్వర్(55) గురువారం మొయినాబాద్ నుంచి ఎలుకగూడకు ఆటోలో వెళ్తుండగా పెద్దమంగళారం చెరువు కట్ట వద్దకు రాగానే ఓ ట్రాక్టర్ అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహేశ్ లాలూ మానేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్సకోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


యాదగిరి (ఫైల్)

నందిగామ: బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే చెట్టును ఢీకొని తీవ్ర గాయాలకు గురైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన చించేటి యాదగిరి(49) బుధవారం సొంతపని నిమిత్తం షాద్‌నగర్ పట్టణానికి వెళ్తున్నక్రమంలో రాత్రి 11.30 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై పాత జాతీయ రహదారినుంచి అతివేగంగా వస్తున్నాడు. కమల్ వైనరీస్ పరిశ్రమ సమీపంలో చేరుకునే లోపే బైక్ అదుపు తప్పింది. అక్కడ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో యాదగిరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏమార్చి.. నగదు అపహరించి

స్కూటీలో నుంచి రూ. 2.30లక్షల చోరీ

షాద్‌నగర్ రూరల్: ద్విచక్ర వాహనదారుడిని ఏమార్చి..నగదు అపహరించిన ఘటన గురువారం షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి, పోలీసుల వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలో నివసిస్తున్న దాసరి శ్రీనివాస్ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి రోడ్డులోని కొత్తకోట పీపుల్స్ పాఠశాలలో పని చేస్తున్నాడు. పాఠశాలలో సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు డబ్బులు అవసరమై ప్రిన్సిపాల్ రూ.3లక్షల చెక్కును రాసి పట్టణంలోని ఏపీజీవీబీ బ్యాంకులో డబ్బులు తెమ్మని దాసరి శ్రీనివాస్‌కు ఇచ్చాడు. స్కూటీపై బ్యాంకుకు వెళ్లిన దాసరి శ్రీనివాస్ బ్యాంకులో డబ్బు డ్రా చేశాడు. కొంత డబ్బును అదే బ్యాంకులో చెల్లించి మిగితా రూ.2.30లక్షల నగదును తన వాహనంలో సీటు కింద డిక్కీలో పెట్టుకొని పాఠశాలకు వస్తున్నాడు. అప్పటికే ఈ విషయాన్ని గమనించిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు శ్రీనివాస్‌ను వెంబడించారు. హైదరాబాద్‌కు వెళ్లే దారి గుండా పాఠశాలకు వస్తున్నక్రమంలో మార్గ మధ్యలో శ్రీనివాస్ ఆగి వాహానానికే తాళం ఉంచి దుకాణానికి వెళ్లాడు. అదును కోసం చూస్తున్న దొంగ వాహనం నుంచి తాళాన్ని తీసుకుని ఎవరికీ అనుమానం రాకుండా దుకాణం సమీపంలో నిలబడ్డాడు. మరో వ్యక్తి శ్రీనివాస్ వద్దకు వెళ్లి స్కూటీ తాళాన్ని ఎవరో తీసుకెళ్లాడని చెప్పడంతో అతన్ని పట్టుకోవడానికి శ్రీనివాస్ మరో వ్యక్తి వాహనంపై వెళ్లాడు. దీంతో అక్కడ పార్క్‌చేసిన వాహనం వద్ద ఎవరు లేకపోవడాన్ని గుర్తించిన దుండగుడు స్కూటీలోని రూ.2.30లక్షల నగదును దొంగిలించి పరారయ్యాడు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


నగదు దొంగిలించిన స్కూటీ ఇదే